క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఆరుగురికి చోటు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వివిధ హోదాల్లో ప్రకటించిన పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు చెందిన ఆరుగురికి అవకాశం కల్పిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం ఉపాధ్యక్షులుగా పుంగనూరుకు చెందిన పుష్పావతి, రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ జనరల్ సెక్రటరీగా తిరుపతికి చెందిన కేతంరెడ్డి మురళీరెడ్డి, రాష్ట్ర సెక్రటరీలుగా గంగాధర్ నెల్లూరుకు చెందిన వి.సుందర్ రాజు, సత్యవేడుకు చెందిన జేబీ.మునిరత్నం (జేబీఆర్), తిరుపతికి చెందిన తిరుమల రెడ్డి, భరత్ రెడ్డిని నియమించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా చిత్తూరు జిల్లా నుంచి పలమనేరుకు చెందిన జి.ప్రహ్లాద, ఆర్.చెంగారెడ్డి, ఎస్‌డీ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా నుంచి శ్రీకాళహస్తికి చెందిన షేక్ సిరాజ్‌బాషా నియమితులయ్యారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక


ఆదిత్య


హిమకేష్

తిరుపతి ఎడ్యుకేషన్: అండర్–15 రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు తిరుపతికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. జూన్ 29 నుంచి జూలై 1వ తేదీ వరకు మదనపల్లిలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతి జిల్లా జట్టు 2వ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తిరుపతికి చెందిన ఆదిత్య, హిమకేష్‌లను రాష్ట్ర జట్టుకు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు. త్వరలో విశాఖపట్నంలో నిర్వహించనున్న క్యాంపులో పాల్గొననున్నారని, ఆ తరువాత పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున వీరిద్దరు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన వీరిని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

తాళం పగులగొట్టి చోరీ

- 55 సవర్ల బంగారు నగలు, 3 లక్షల నగదు అపహరణ


బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట పట్టణంలోని మూకాంబిక గుడి వీధిలోని ఓ ఇంటిలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనను బాధిత కుటుంబ సభ్యులు శనివారం రాత్రి గుర్తించారు. సమాచారం అందుకున్న నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ముకాంబిక గుడి వీధిలో నివాసం ఉంటున్న హరేంద్ర, అతడి భార్య సునీత శనివారం ఉదయం 10.30 గంటలకు గూడూరులో జరిగే జగన్నాథ యాత్రలో పాలు పంచుకునేందుకు వెళ్లారు. తిరిగీ రాత్రి ఇంటికి వచ్చే సరికి తలుపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి అవాక్కయ్యారు. ఇంటిలోకి వెళ్లి చూడగా 30 సవర్ల బంగారు, నగదు రూ.50 వేలు, వెండి వస్తువులు, సునీత స్నేహితురాలిగా ఉన్న మరో మహిళకు సంబంధించిన 25 సవర్ల బంగారు నగలు, రూ.2.50 లక్షల నగదును చోరీ చేసుకుని వెళ్లి ఉండటాన్ని బాధితులు గుర్తించారు. అయితే ఈ దొంగతనం మధ్యాహ్న సమయంలో జరిగి ఉండవచ్చునని బాధితులు భావిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రబుల్ మేజర్

- డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానాన్నే కొనసాగించాలి
- డబుల్ మేజర్ వద్దే వద్దు అంటున్న కళాశాలలు
- ప్రైవేటు కళాశాలల పట్టు.. మెట్టు దిగిన ఉన్నత విద్యామండలి
- సింగిల్ మేజర్ విధానం వైపే ప్రభుత్వం మొగ్గు
- త్వరలో డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

తిరుపతి సిటీ : ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కూటమి ప్రభుత్వ నిర్ణయంపై తిరగబడ్డారు. దీంతో ఉన్నత విద్యామండలి కాస్త వెనుకడుగు వేసింది. డిగ్రీ కోర్సులలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని, డబుల్ మేజర్ సబ్జెక్ట్ విధానంతో తమకు తలనొప్పి తప్పదని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నత విద్యా మండలికి తెగేసి చెప్పినట్లు సమాచారం. దీంతో ఉన్నత విద్యామండలి సందిగ్ధంలో పడింది.

గత నాలుగు మాసాలుగా డబుల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి ప్రత్యేక నిపుణుల కమిటీని నియమించి సుదీర్ఘంగా చర్చించి నివేదిక తెప్పించుకుంది. దీంతో పాటు డబుల్ మేజర్ సబ్జెక్టులకు సంబంధించి కరిక్యులమ్ సైతం కమిటీ రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. పేరొందిన కార్పొరేట్, ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం ప్రతిపాదించిన డబుల్ మేజర్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. దీంతో ఉన్నత విద్యామండలి డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయడంలో జాప్యం చేస్తోంది.

డబుల్ మేజర్‌తో సమస్యలు

డిగ్రీ కోర్సులలో డబుల్ మేజర్ సబ్జెక్ట్ విధానానికి, మల్టీ డిసెప్లెనరీ విధానానికి పెద్ద తేడా లేదని ప్రైవేటు కళాశాలలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంతోనే విద్యార్థులకు, అటు కళాశాలలకు ఎంతో ఉపయోగకరమని వారు వాదిస్తున్నారు. డబుల్ మేజర్ విధానంతో అధ్యాపకుల కొరత, నూతన అధ్యాపకుల

జిల్లా సమాచారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	18
టీటీడీ కళాశాలలు	5
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	104
సింగిల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలంటున్న కళాశాలలు	106
డబుల్ మేజర్ కొనసాగించాలంటూ ప్రభుత్వాన్ని కోరిన కళాశాలలు	15
ఏదైనా సరే అంటూ సిద్ధపడ్డ కళాశాలలు	6
సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌తో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు	సుమారు 25 మంది
డిగ్రీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు	32,600

నియామకం, కళాశాలలలో ల్యాబ్ సౌకర్యాలు ఇప్పటికిప్పుడు సమకూర్చుకోవడం సాధ్యం కాదని ఈ విధానం తలనొప్పితో పాటు భారీ ఖర్చుతో కూడుకున్నదని ప్రభుత్వానికి విన్నవించారు. ఇటు ప్రభుత్వ కళాశాలలు మాత్రం డబుల్ మేజర్ విధానం ప్రవేశపెడితే అడ్మిషన్లు పెరుగుతాయని అభిప్రాయాన్ని వెళ్లడిస్తున్నారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానాన్ని కొనసాగించేందుకు ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఇంకా పూర్తి స్థాయిలో నిర్ణయం వెలువడాల్సి ఉంది.

ఈఏపీసెట్ కౌన్సెలింగ్ తర్వాతే నోటిఫికేషన్

డిగ్రీ నోటిఫికేషన్ కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల మంది విద్యార్థులు మూడు మాసాలుగా ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ నెలలో ఇంటర్ ఫలితాలు విడుదలైనా ఇంత వరకు డిగ్రీ ప్రవేశాలపై ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకోకపోవడంతో దారుణమని విద్యార్థులు వాపోతున్నారు. కాగా ఈనెల 6వ తేదీ నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి. తొలివిడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పూర్తి అయిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

సింగిల్ మేజర్‌తో విద్యార్థులకు ప్రయోజనం



డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టులో డిగ్రీ పొందిన విద్యార్థికి అనేక ప్రయోజనాలు ఉంటాయి. ప్రధానంగా పోటీ పరీక్షలలో ఆప్షనల్ సబ్జెక్ట్‌గా యూజీలో తీసుకున్న మేజర్ సబ్జెక్టును ఎంపిక చేసుకొని మంచి మార్కులు స్కోర్ చేసుకునేందుకు వీలుంటుంది.

– ప్రభాకర్‌రెడ్డి, ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు, తిరుపతి

డబుల్ మేజర్‌ను ఎవరూ కోరడం లేదు



డబుల్ మేజర్‌ను ఏ విద్యార్థి కోరుకోవడం లేదు. మూడు, రెండు సబ్జెక్టులను మేజర్‌గా చదువుకునే విద్యార్థికి శ్రమ తప్ప ఉపయోగం ఉండదు. అధ్యాపకులు, మౌలిక సదుపాయాల కల్పనలో విద్యా సంస్థలు వెనుకబడతాయి. – రాజేశ్వరి, కార్పొరేట్ కళాశాల అధ్యాపకురాలు, తిరుపతి

పోటీ పరీక్షలకు ఉపయోగకరం



డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం చదివిన వారికి సివిల్స్, గ్రూప్స్, ఠీసెట్, పీజీసెట్, ఐసెట్, వంటి పోటీ పరీక్షలలో నెగ్గేందుకు సులువుగా ఉంటుంది. డబుల్ మేజర్‌తో రెండు ప్రధాన సబ్జెక్టలపై దృష్టి సారించాల్సి ఉంటుంది.

– శిరీషా, డిగ్రీ విద్యార్థిని, తిరుపతి

ఫీజురీయింబర్స్‌మెంట్ ఊసేలేదు



ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి కూటమి ప్రభుత్వం చెల్లించలేదు. మళ్లీ నూతన విధానం అంటూ డిగ్రీలో డబుల్ మేజర్ సబ్జెక్టును ప్రవేశపెట్టి విద్యార్థుల జీవితాలతో అడుకుంటోంది. తల్లిదండ్రులు గత ఏడాది అప్పులు చేసి ఫీజు చెల్లించిన పరిస్థితి చూశాం.

– లక్ష్మీనరసింహులు, విద్యార్థి, రేణిగుంట

నోటిఫికేషన్ రాకపోవడం బాధాకరం



ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ నెలలో వచ్చాయి. కానీ ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కాకపోవడం ఆశ్చర్యం. విద్యావ్యవస్థలో ఏ విధానాన్ని కొనసాగించాలో తెలియక ఉన్నత విద్యామండలి తికమక పడుతూ అడ్మిషన్లు జరపకుండా ఆలస్యం చేయడం బాధాకరం. – ప్రసన్న, డిగ్రీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థి, తిరుపతి రూరల్

లోక్ అదాలత్‌లో 2352 కేసుల పరిష్కారం

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 2352 కేసులు పరిష్కారం అయినట్లు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ గురునాథ్ తెలిపారు. పరిష్కారమైన కేసులలో 371 కోర్టుల్లో పెండింగ్ ఉన్న సివిల్ , క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద కేసులు, వివాహ సంబంధాల కేసులు, తదితర కేసులు ఉన్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. అలాగే 1981 జరిమానాలు చెల్లించే క్రిమినల్ కేసులను పరిష్కరించి నిందితులకు 60 లక్షలా 25 వేల వంద రూపాయలు జరిమానా విధించినట్లు న్యాయమూర్తి తెలిపారు. తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10:30 గంటలకు తిరుపతి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభమైంది. కేసుల పరిష్కారం కోసం ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 8 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. జడ్జి గురునాథ్‌తో పాటు ఐదవ అదనపు జిల్లా జడ్జి రామ్ గోపాల్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి విజయసారధిరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, ఇతర జూనియర్ సివిల్ జడ్జిలు గ్రంధి శ్రీనివాస్ ,శ్రీకాంత్ , సత్యకాంత్ కుమార్, సంధ్యారాణి, కోటేశ్వరరావు ఈ లోక్ అదాలత్ బెంచ్‌లకు అధ్యక్షులుగా వ్యవహరించి కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంకు, బీమా, ఆర్టీసీ ఇతర వివిధ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. పట్టుబడ్డ ఎర్రచందనం


ఎర్ర చందనం దుంగలు రవాణా చేస్తూ పట్టుబడ్డ వాహనం

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని అగ్నిమాపకశాఖ కార్యాలయం సమీపంలో రహదారిపై బైక్‌ను ఢీకొని ఎర్రచందనం తరలిస్తున్న వాహనం శనివారం పోలీసులకు పట్టుబడింది. ఫారెస్ట్ డీఆర్వో కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. వెంకటగిరి వైపు నుంచి వస్తున్న కారు పట్టణ పరిధిలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదుట రహదారిపై వెళుతున్న బైక్‌ను ఢీకొంది. అక్కడ యూనిఫామ్‌లో అగ్నిమాపకశాఖ అధికారులు వచ్చేటప్పటికే కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు మరొక వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యారు. కారు వెనుక డోర్‌లో తెరిచి చూడగా ఎర్ర చందనం దుంగలు ఉండడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి వాహనం అప్పగించినట్లు డీఆర్వో తెలిపారు. 237 కేజీలకు పైగా ఉన్న 46 ఎర్ర చందనం దుంగలతో పాటు వాహనం విలువ రూ. 3 లక్షలు వరకు ఉంటుందన్నారు.అటవీశాఖ రేంజ్ అధికారి రమణయ్య పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఆర్వో వెల్లడించారు.

చెవిరెడ్డి అక్రమ అరెస్టుపై నిరసనలు


ఎర్రావారిపాళెం మండల కేంద్రంలో మహిళల నిరసన ర్యాలీ


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

భాకరాపేట: కూటమి ప్రభుత్వం కుట్రలో భాగమే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపించారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఎర్రావారిపాళెం మండల కేంద్రంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. చెవిరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకనే తప్పుడు కేసులు నమోదు చేయించి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. చెవిరెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోహిత్‌రెడ్డిపై పెట్టిన కేసును కూడా ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, పాకాల, తిరుపతి రూరల్, రామచంద్రాపురం ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఐఐటీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ఏర్పేడు: తిరుపతి ఐఐటీలో మూడు రోజులుగా జరిగిన అంతర్జాతీయ సమావేశం శనివారంతో ముగిసింది. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎస్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణ సామగ్రి, నిర్మాణాలపై మూడో అంతర్జాతీయ సమావేశం (ఐసీసీఎంస్– 2025)లో నిర్మాణ రంగంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై గొప్ప ప్రసంగాలు, ప్రదర్శనలు చేసి, ఆ రంగంలో ప్రపంచస్థాయి అభివృద్ధికి భవిష్యత్తు కార్యాచరణపై నిర్మాణాత్మక ప్రసంగాలు చేశారు. ఈ సమావేశానికి డజనుకు పైగా దేశాల నుంచి 550 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

సినర్జీ ఆఫ్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్ అనే అంశంపై వాతావరణ పరిణామాలు, వనరుల కొరత, డిజిటల్ పరివర్తన, పట్టణ సంక్లిష్టత తదితర తీవ్ర సవాళ్లను ఎదుర్కొనేందుకు అధునాతన నిర్మాణ రూపకల్పనతో మెటీరియల్ ఆవిష్కరణలపై చర్చించారు. సమావేశంలో 10 ప్లీనరీ లెక్చర్లు, 21 కీలక ప్రసంగాలు, 427 సాంకేతిక పత్ర ప్రజెంటేషన్లు, 113 పోస్టర్ సెషన్లు భౌతిక, హైబ్రిడ్ ఫార్మాట్లలో జరిగాయి. ఈ సెషన్లలో అల్ట్రా–హై–పెర్ఫార్మెన్స్ కాంక్రీట్, తక్కువ కార్బన్ సిమెంట్లు, డిజిటల్ నిర్మాణ సాంకేతికత, జీవిత చక్ర రూపకల్పన ఫ్రేమ్‌వర్క్‌లు, అగ్ని నిరోధక పదార్థాలు, నిర్మాణ ఆరోగ్య పర్యవేక్షణ అంశాలపై లోతైన అధ్యయనానికి దారితీసే చర్చలు ఫలప్రదంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్లీనరీ స్పీకర్లు ప్రొఫెసర్ మైక్ షిలెఫ్, ప్రొఫెసర్ జియాన్లూకా రాంజీ, ప్రొఫెసర్ మను సంతానం, ప్రొఫెసర్ మార్టిన్ మెన్సింగర్, ప్రొఫెసర్ వెంకటేష్ కోడూర్, ప్రొఫెసర్ బాల్తాసర్ నోవాక్, దామోదర్ కత్తి ప్రొఫెసర్ వసంత్ మత్సగర్, డాక్టర్ ఎస్. అలెగ్జాండర్ బ్రాండ్, డాక్టర్ జిట్టిన్ వర్గీస్, ప్రొఫెసర్ రాధాకృష్ణ పిళ్లై ప్రొఫెసర్ ప్రదీప్ సర్కార్ ప్రసంగించారు. మౌఖిక, పోస్టర్ విభాగాలలో అసాధారణమైన ప్రదర్శనలను గుర్తించి, తొమ్మిది ఉత్తమ పేపర్, పోస్టర్ అవార్డులను ఐఐటీ డైరెక్టర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సురేష్‌జైన్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో మర్చిపోయిన నగలు అప్పగింత


నగలను భక్తులు అప్పగిస్తున్న సూపరింటెండెంట్లు

తిరుమల : తిరుమలలోని వకుళామాత గెస్ట్ హౌస్‌లో భక్తులు మర్చిపోయిన నగలను తిరిగీ అప్పగించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మధురైకి చెందిన శివ కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనం ముగించుకొని తను విశ్రాంతి తీసుకున్న రూమ్‌లో 128 గ్రాముల బంగారు ఆభరణాలు మర్చిపోయి వెళ్లిపోయాడు. గమనించిన సిబ్బంది వెంటనే సూపరింటెండెంట్లు భాస్కర్ నాయుడు, కుమారి స్వామికి అప్పగించారు. శివ ఫోన్ నంబర్ సేకరించి అతడిని పిలిపించి తిరిగీ వారి నగలు అప్పగించారు. దీంతో భక్తులు టీటీడీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

13న బాడీ బిల్డింగ్ పోటీలు


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రవీణ్, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: కడప నగరంలోని శ్రీసాయి శ్రీనివాస గార్డెన్స్ రామాంజనేయపురంలో ఈనెల 13న జరిగే రాష్ట్ర స్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలకు తన వంతు సహకారం అందిస్తానని గోల్డెన్ ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఈమేరకు కడప జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, షేక్ యూనస్ బాషా శనివారం తిరుపతిలో డాక్టర్ ప్రవీణ్‌ను కలిసి బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటీలకు తన వంతు సాయంగా ఆయన రూ.55 వేలు స్పాన్సర్ చేస్తున్నట్లు ప్రకటించారు.

10న మెగా పీటీఎం

– తల్లికి వందనం పెండింగ్ పూర్తికి కృషి

తిరుపతి అర్బన్: ఈనెల 10న మెగా పీటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీటింగ్) నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకం అందని వారికి ఈనెల 10వతేదీకి తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న పీటీఎంలో స్వల్ప మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు స్కూల్స్‌లోనే కాకుండా ఇంటర్ వరకు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆ మేరకు ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన 1 నుంచి ఇంటర్ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హాజరుకావాలని సూచించారు. గత ఏడాది తల్లి మాత్రమే వచ్చారని...ఈ ఏడాది ఇద్దరు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందిస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రత్యేక మెనూ ఏర్పాటు చేశామని విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనం ఉంటుందని వివరించారు. మరోవైపు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ×ఏక్ పేడ్ మాకే నామ్ పర్వ్ అంటే తల్లి పేరుతో ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐఓ రాజశేఖర్, సమగ్ర శిక్ష సీఎండీ సురేష్, సూపరింటెండెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమ్మె కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న నేతలు

తిరుపతి సిటీ : లేబర్ కోడ్ల రద్దు కోసం ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా శనివారం వెటర్నరీ యూనివర్సిటీలో ఆప్కాస్, సీఐటీయూ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నేతలు కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల కారణంగా కార్మికుల బతుకులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, కాంట్రాక్ట్, సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా జేఏసీ చైర్మన్ నాగ వెంకటేష్, సుభహాన్ బాబు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు

తిరుపతి సిటీ : ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో పెంపుడు శునకాలు, పిల్లులకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వెటర్నరీ కళాశాలలోని పశువైద్యశాల, తాతయ్యగుంట పశువుల ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుంచి టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు.

కలెక్టర్‌ను కలిసిన తుడా సెక్రటరీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తుడా సెక్రటరీ

తిరుపతి అర్బన్ : కలెక్టర్ వెంకటేశ్వర్‌ను తుడా సెక్రటరీ ఎస్వీ శ్రీకాంత్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. తుడా అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

యాచకుల పరివర్తనకు ప్రత్యేక కేంద్రం

తిరుపతి తుడా : కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని యాచకుల పరివర్తన కోసం ప్రత్యేకంగా పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. స్మైల్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎమ్మార్‌పల్లెలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడి కేంద్రంలో వసతులపై ఆరా తీశారు. బిచ్చగాళ్లను ఎవరైనా ఈ కేంద్రంలో చేర్పించవచ్చని వెల్లడించారు. ఇందులో యాచకులకు ఇష్టమైన వృత్తిలో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం వారు తిరిగి భిక్షాటన చేయకుండా పని చేసుకుని జీవనం సాగించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే ఎమ్మార్‌పల్లె పార్కును సందర్శించారు. పార్కులోని వ్యాయామ, ఆట వస్తువులకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చిపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవ మూర్తులకు కనుల పండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం దేవదేవేరులను బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.

నేడే బీసీ ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న నాగరాజగౌడ్

తిరుపతి కల్చరల్ : బీసీల హక్కుల సాధనే లక్ష్యంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఇందిరా మైదానంలో బీసీ ఆత్మగౌరవ భరోసా సభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజగౌడ్ తెలిపారు. శనివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ మధ్యాహ్నం 2 గంటలకు బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలే విగ్రహం నుంచి ఇందిరామైదానం వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. పెద్దసంఖ్యలో బీసీలు తరలివచ్చి ర్యాలీ, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ అధ్యక్షుడు పరసారత్నం, బీసీ నేత లోకనాథ్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు గ్రహణం

సూరావారిపల్లెలో దెబ్బతిన్న రోడ్డు, దారి పక్కన పేరుకుపోయిన చెత్తచెదారం





గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేసే రోడ్లకు గ్రహణం పట్టింది. గుంతలమయంగా మారి చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధి గొప్పలు చెప్పుకోవడమే కానీ, క్షేత్రస్థాయిలో రాకపోకలకు ఇబ్బందులు తప్పని దుస్థితి దాపురించింది. రాళ్లు తేలిన రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారిపోయింది. అలాగే పలు మార్గాలు చెత్తకుప్పలతో నిండి పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. దుర్వాసన వెదజల్లుతుండడంతో ముక్కుమూసుకుని వెళ్లాల్సివస్తోందని పల్లె ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

- అడుగడుగునా గుంతలమయం
- ప్రమాదకరంగా ప్రయాణం
- గాయాల పాలవుతున్న వాహనదారులు
- రాకపోకలకు తప్పని తిప్పలు

రామచంద్రాపురం : మండలంలోని రాయలచెరువు కట్ట నుంచి తిమ్మరాజుపల్లె మార్గం మీదుగా ప్రయాణించాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాయలచెరువు నుంచి తిమ్మరాజుపల్లె, కాలేపల్లె, సూరావారిపల్లె, గొల్లపల్లె, నెత్తకుప్పం, కొత్తవేపకుప్పం మీదుగా అనుపల్లె నిత్యం పెద్ద సంఖ్యలో గ్రామీణులు రాకపోకలను సాగిస్తుంటారు. అయితే రోడ్లు గుంతలమయంగా మారడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా తిమ్మరాజుపల్లె నుంచి అనుప్పల్లెకు వెళ్లే గ్రావెల్ రోడ్డు దారుణంగా ఉంది. సూరావారిపల్లె వద్ద తారు రోడ్డు పగిలిపోయి, రాళ్లు తేలాయి. గొల్లపల్లె రహదారిపై కంకర రాళ్లు తేలడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. తిమ్మరాజుపల్లె, ఎన్ఆర్ కమ్మపల్లె కూడలి వద్ద రోడ్డు పక్కనే చెత్తా చెదారం పేరుకుపోయింది. పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని వ్యర్థాలను పడేయంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణస్థాయి నుంచి పురోగతి సాధిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా పల్లెరోడ్లకు మాత్రం మోక్షం కల్పించడంలేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. గ్రామాలను అనుసంధానం చేసే లింక్ రోడ్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాలకు ప్రత్యేక నిధులను మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేస్తున్నారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత కనీస వసతులు కూడా కరువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

50 గ్రామాలకు అదే దారి

అనుప్పల్లె నుంచి రామచంద్రాపురం వెళ్లే మార్గంలో సుమారు 50కి పైగా గ్రామాలు ఉన్నాయి. మహిళా సంఘ సభ్యులు బ్యాంకులకు వెళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవాలన్నా, ఉద్యోగులు తమ గమ్యస్థానాలకు చేరాలన్నా ఈ మార్గం గుండా ప్రయాణించాల్సిందే. అంతటి ప్రాముఖ్యత ఉన్న రోడ్లు అధ్వాన్నంగా మారడంతో ప్రజలు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.



గొల్లపల్లె వద్ద కంకర తేలిన రహదారిపై వెళుతున్న వాహనాలు

పట్టించుకోవడం లేదు



రాయల చెరువు కట్ట నుంచి అనుపల్లె వరకు సుమారు 12 కిలోమీటర్ల రహదారి దారుణంగా మారిపోయింది. కనీసం మరమ్మతులు చేయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇక ప్రజాప్రతినిధులైతే స్పందించడమే లేదు.

– యశ్వంత్, సీకే పల్లె

తరచూ ప్రమాదాలు



గ్రామీణ ప్రాంతాల రోడ్లు ఉన్నాయి అవి పూర్తిగా గుంతల మయం కావడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అలాగు ఇతర వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము రేగడంతో ముందు కనపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో రోడ్లకు కనీసం మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– కుమార్, తిమ్మరాజుపల్లె

నోటీస్ బోర్డు

- ఎస్వీయూలోని అన్నమయ్య భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా.
- టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన జర్నలిస్టుల పిల్లలకు ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు నగదు ప్రోత్సాహకం, జ్ఞాపిక బహూకరణ, సత్కార సభ.
- శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ.
- దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు స్కూటర్ ర్యాలీ.
- శ్రీగోవిందరాజస్వామి జ్యేష్ఠాభిషేకంలో భాగంగా ఉదయం 9 గంటలకు కలశ స్థాపన, మహాశాంతి హోమం, 11 గంటలకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం.
- శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్ల పంపిణీ.
- ఇందిరా మైదానంలో సాయంత్రం 4 గంటలకు బీసీ ఆత్మగౌరవ సభ, ఈ క్రమంలోనే మధ్యాహ్నం 2 గంటలకు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి సభా స్థలం వరకు ర్యాలీ.

75 కేసుల పరిష్కారం



అదాలత్‌లో న్యాయమూర్తి పూర్ణిమాదేవి

పాకాల : కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి పూర్ణిమాదేవి తెలిపారు. శనివారం ఈ మేరకు చేపట్టిన అదాలత్‌లో 75 కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు. కక్షిదారులకు రూ.1,24,79,075 లబ్ధి చేకూరినట్లు వెల్లడించారు. న్యాయవాదులు గురుస్వామి నాయుడు, గౌరీ శంకర్ రాజు, రెడ్డప్ప నాయుడు, ప్రవీణ్ ప్రకాష్, చంద్రమోహన్, సుబ్రమణ్యం రెడ్డి, సీఐ సుదర్శన్ ప్రసాద్ పాల్గొన్నారు.

అయోమయంలో అకడమిక్ కన్సల్టెంట్లు

- ఎస్వీయూలో ముగిసిన ఇంటర్వ్యూలు
- 241మంది తాత్కాలిక అధ్యాపకుల పెర్ఫార్మెన్స్ రివ్యూ



అధికారుల ఎదుట డెమో ఇస్తున్న తాత్కాలిక అధ్యాపకుడు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఈనెల 1వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు అకడమిక్ కన్సల్టెంట్లకు పెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో నిర్వహించిన ఇంటర్వ్యూలు శనివారం ముగిశాయి. రాష్ట్రంలోని ఏ యూనివర్సిటీలో జరగని విధంగా ఎస్వీయూలో తాత్కాలిక అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. అకడమిక్ కన్సల్టెంట్ల విషయంలో కోత విధించాలని లక్ష్యంగా పెట్టుకుని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రివ్యూ పేరిట తాత్కాలిక ఉద్యోగులను పెద్ద సంఖ్యలో తొలగించి నూతన నోటిఫికేషన్ ద్వారా తమ అనుచరులు, రాజకీయ నేతల సిఫార్సులతో మరి కొందరిని నియమించుకునేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తమ భవిష్యత్‌పై అయోమయంలో అకడమిక్ కన్సల్టెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది.

నాణ్యమైన బోధనే లక్ష్యం

యూజీసీ నిబంధనల ప్రకారమే అకడమిక్ కన్సల్టెంట్ల పెర్ఫార్మెన్స్ రివ్యూ నిర్వహించాం. ప్రధానంగా వర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడమే లక్ష్యం. విద్యా సలహాదారులు తమ నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేసుకోవడం, ఆధునిక బోధనా విధానాలను అవలంబించేందుకు ఈ ఇంటర్వ్యూలు ఉపయోగపడ్డాయి. ఉన్నత విద్యా ప్రమాణాలను పాటించేందుకు ప్రేరణాత్మక వేదికగా సమీక్ష పనిచేసింది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు

– అప్పారావు, వీసీ, ఎస్వీయూ

స్విమ్స్ కార్మికుల దీక్ష విరమణ



కార్మిక సంఘాల నేతలతో చర్చిస్తున్న అధికారులు

తిరుపతి తుడా : సమస్యల పరిష్కారం కోసం 10 రోజులుగా రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్న స్విమ్స్ కార్మికులు శనివారం ఎట్టకేలకు దీక్ష విరమించారు. టీటీడీ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆర్డీఓ కార్యాలయంలో కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి విశ్రాంత ఐఏఎస్‌లతో ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 15వ తేదీన కమిటీ తిరుపతి వచ్చి కార్మికుల సమస్యలను తెలుసుకుని నివేదిక సమర్పిస్తుందని వెల్లడించారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకూడదని దీక్ష విరమిస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు.

జీవాల దొంగలు అరెస్ట్

చంద్రగిరి: గొర్రెలు, మేకలను చోరీ చేస్తున్న ఐదుగురిని తిరుచానూరు పోలీసులు అరెస్ట్ చేశారు. జీవాలతో పాటు కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ వివరాలను వెల్లడించారు. జూన్ 25వ తేదీన తనపల్లి పంచాయతీ నల్లమనికాల్వకు చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి, తన పొలంలో రెండు మేకలను కట్టేశారు. గుర్తు తెలియని వ్యక్తులు వాటిని అపహరించడంతో, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో ఈనెల 3న కరకంబాడి రోడ్డులో మేకలను అపహరిస్తున్న మణికంఠ, చందు, జయకృష్ణ, నవీన్‌కుమార్, నితిన్‌ను అరెస్ట్ చేశారు. విచారణలో వారు 12 మంది రైతులకు చెందిన మొత్తం 45 జీవాలను చోరీ చేసినట్లుగా తేలిందని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐలు సాయినాథ్ చౌదరి, జగన్నాథరెడ్డి సిబ్బందిని అభినందించారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా : ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యమని మేయర్ శిరీష తెలిపారు. శ్రీగోవిందరాజస్వామి ఆలయ సన్నిధి వీధిలో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించిన నేపథ్యంలో శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షించారు. మేయర్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో నిత్యం వేలాదిమంది భక్తులు సందర్శించే ఆలయాలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఆయా ఆలయాల వద్ద దుకాణదారులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే అగ్నిమాపక, విపత్తుల నివారణశాఖ అధికారులు సైతం ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. అధిక సంఖ్యలో జనం సంచరించే బస్టాండ్, రైల్వేస్టేషన్, సినిమా థియేటర్ల వద్ద మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గోవిందరాజస్వామి ఆలయం సమీపంలో అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని సందర్శించినప్పుడు అక్కడ ఆందోళన కలిగించే పరిస్థితులు గుర్తించామని వెల్లడించారు. నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి దుకాణదారులను అప్రమత్తం చేయాలని కోరారు. అలాగే నగరంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి అగ్నిప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. కమిషనర్ మౌర్య, ఉప కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి



సూచనలిస్తున్న వీరయ్య చౌదరి

రామచంద్రాపురం : మామిడి సాగులో సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడిని సాధించవచ్చని విజయవాడకు చెందిన సమగ్ర సస్యరక్షణ కేంద్రీయ అధికారి వీరయ్య చౌదరి తెలిపారు. శనివారం మండలంలోని నడవలూరు, గంగిరెడ్డిపల్లె, రామాపురం, కమ్మకండ్రిగతో ఉద్యాన అధికారి శివకుమారితో కలసి మామిడి తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మామిడి తోటల్లో పంట కోసిన తర్వాత చేపట్టవలసిన కొమ్మ కత్తిరింపులు, దున్నకాలు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కత్తిరింపుల అనంతరం కాపరాక్సీ క్లోరైడ్ 3 గ్రాములను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే వాలుకు అడ్డంగా దున్నుకోవాలని, పచ్చిరొట్ట పైర్లు వేసుకొని పూత దశలో కలియ దున్నాలని చెప్పారు. పదేళ్ల పైబడి చెట్లకు 100 కిలోల చొప్పున పశువుల ఎరువు, రెండు కిలోల యూరియా, 5 కిలోల సూపర్ పాస్ఫేట్, 1.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. ప్రస్తుతం మామిడిలో ఆకు గూడు జల్లెడ పురుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు గూళ్లను కర్రలతో చెదరగొట్టి క్లోరిపైరిఫాస్ లేదా క్వినాల్ ఫాస్ రెండు మిల్లీలీటర్లను లీటర్ నీటి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. జాతీయ చీడపీడల నిఘా వ్యవస్థ యాప్‌ని రైతులు డౌన్‌లోడ్ చేసుకుని సలహాలు పొందవచ్చని వెల్లడించారు. ఉద్యాన సహాయకులు పూజిత పాల్గొన్నారు.

స్విమ్స్‌లో 'నిరంతర వైద్యవిద్య'



జ్యోతి ప్రజ్వలనలో అతిథులు

తిరుపతి తుడా : స్విమ్స్‌లోని పద్మావతి ఆడిటోరియంలో శనివారం ఎండోమెట్రియల్ క్యాన్సర్–నిరంతర వైద్య విద్య కార్యక్రమం నిర్వహించారు. పాథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శివకుమార్, స్వీకార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్, రేడియేషన్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యామిని కుమార్, మెడికల్ అంకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదిత్య జ్యోతి ప్రజ్వలనతోపాటు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. ఎండోమెట్రియల్ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిర్వహణలో గర్భాశయ తొలగింపు, అండాశయాలు, ఫెలోపియన్ ట్యూబ్ తొలగింపు విభజన ఉంటుందని, ల్యాపరోస్కోపిక్ లేదా రోబోటిక్ సర్జరీల ద్వారా చాలా త్వరగా కోలుకోవడం జరుగుతుందని వివరించారు. రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, డాక్టర్ మణిలాల్, డాక్టర్ భార్గవి, డాక్టర్ సుబ్రమణియన్, డాక్టర్ రుక్మాంగద, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కవితా సంకలనం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్ : వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కవితా సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాహితీ వేత్తలు మాట్లాడుతూ కవితలన్నింటినీ పుస్తకంగా తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న మాట్లాడుతూ పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. తొలి ప్రతిని ఈతరం కవితా వేదిక తోట వెంకటేశ్వర్లుకు అందజేశారు. సాహితీవేత్తలు మన్నవ గంగాధరప్రసాద్, సాకం నాగరాజు, ఆముదాల మురళి, మౌని, పీసీ వెంకటేశ్వర్లు, హేమంత్‌కుమార్, మల్లేశ్వరరావు, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, ఏనుగు అంకమనాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం, మూరిశెట్టి గోవింద్, కృష్ణస్వామి రాజు, ఉషారాణి, లక్ష్మి, బాదుల్లా పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు పక్కాగా వసతులు



మాట్లాడుతున్న ఈఓ శ్యామలరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : శ్రీవారి భక్తులకు పక్కాగా వసతులు కల్పించేందుకు చేపట్టిన భవన నిర్మాణాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని టీటీడీ ఈఓ శ్యామలరావు ఆదేశించారు. శనివారం టీటీడీ పరిపాలన భవనంలో అదనపు ఈఓ వెంకయ్య చౌదరితో కలసి సమీక్ష నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ దళారీలు, నకిలీ సేవా టికెట్ల విక్రయాల నిర్మూలనకు నిఘా పెట్టాలని సూచించారు. అలిపిరి టోల్ గేట్ వద్ద చెకింగ్ పాయింట్ విస్తరణ, కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ కేవీ మురళీకృష్ణ, ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ పాల్గొన్నారు.

దేనికైనా రెడీ

- మీ చర్యలకు ప్రతి చర్య ఉంటుంది
- తప్పుడు కేసులు.. దాడులు దుర్మార్గం
- చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



అజయ్‌తో మాట్లాడుతున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



సర్పంచ్ భారతి కుమారుడిని పరామర్శిస్తున్న హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి : కూటమి నేతలు గుర్తుపెట్టుకోవాలి.. మీ చర్యలకు తప్పకుండా ప్రతి చర్య ఉంటుంది. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం మా నాన్న లేరనో.. అన్నయ్య లేరనో క్యాడర్‌పై దాడులు చేస్తే సహించం. అక్రమ కేసుల్లో మా వాళ్లని జైలుకు పంపినా భయపడం. కార్యకర్తలను కాపాడుకోవడంలో దేనికైనా సిద్ధంగా ఉంటాం అని వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి స్పష్టం చేశారు. పచ్చమూక దాడుల్లో గాయపడిన ఎం.కొంగరవారిపల్లె సర్పంచ్, దళిత నేత అజయ్‌కుమార్, ప్రవీణ్ కుటుంబాలను ఆయన శనివారం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి భరోసా కల్పించారు. హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ దాడులకు పాల్పడిన టీడీపీ నేతలు, కార్యకర్తలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఏక పక్షంగా వ్యవహరిస్తే న్యాయస్థానాల్లో ప్రైవేట్ కేసులు పెడతామని హెచ్చరించారు. నిందితులను వదిలేసి, బాధితులను పోలీస్‌స్టేషన్ పిలవడం దారుణమని మండిపడ్డారు. అజయ్‌కుమార్ కుటుంబీకులకు తాము అండగా నిలబడతామని, గ్రామంలో కూడా గొడవలు లేకుండా అన్ని రాజకీయ పార్టీల నేతలు కలసిపోవాలని కోరారు. ఉత్సవాలు, జాతర్ల మాటున పరస్పరం దాడులు చేసుకోవడం మంచిది కాదని సూచించారు. అనంతరం ఎం.కొంగరవారిపల్లె సర్పంచ్ భారతి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ క్రమంలోనే పార్టీ నరసింగాపురం పంచాయతీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఇంటికి వెళ్లి మాట్లాడారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని భరోసా కల్పించారు.

సమ్మెపై సమావేశం

తిరుపతి కల్చరల్ : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో అఖిల పక్ష విద్యార్థి సంఘాల నేతలు సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత్ తేజ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్,, ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మెకు దిగుతున్నట్లు వెల్లడించారు.